ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
శుక్రవారం 19 జూలై 2024



- ప్రిన్సిపాళ్ల నుంచి కేజీబీవీ ప్రత్యేకాధికారులకు అప్పగింత
- పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది కరువు
- హాస్టళ్లలో వందమందికి సరిపోయేలా వసతులు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు
- పదకొండేళ్లుగా భర్తీకాని ఉపాధ్యాయ ఖాళీలు
- బదిలీలు లేక నైరాశ్యంలో టీచర్లు

ఆదర్శ పాఠశాలల్లో.. అన్నీ సమస్యలే

చేతులు మారిన హాస్టళ్ల నిర్వహణ

హనుమకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శ (మోడల్) పాఠశాలలు అసౌకర్యాలకు నిలయాలుగా మారాయి. రాష్ట్ర ప్రభుత్వానికి కస్తూర్బా గాంధీ విద్యాలయాలు (కేజీబీవీ), గిరిజన ఆశ్రమ పాఠశాలలపై ఉన్న శ్రద్ధ ఈ ఆదర్శ పాఠశాలలపై లేదన్నది ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మోడల్ స్కూళ్ల పరిస్థితిని చూస్తే అర్థమవుతోంది. వీటి పట్ల సవతి తల్లి ప్రేమను కనబరుస్తోందని, విశాలమైన స్వంత భవనాలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులున్నా ఈ ఆదర్శ పాఠశాలలు కనీస సౌకర్యాలకు నోచుకోక సమస్యలతో కూనారిల్లుతున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఓవైపు ఉపాధ్యాయుల కొరత వెంటాడుతుండగా.. మరోవైపు పదకొండేళ్లుగా బదిలీలు లేక ఉపాధ్యాయులు నైరాశ్యానికి లోనవుతున్నారు. బోధన, బోధనేతర సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకపోవడం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

హాస్టళ్ల నిర్వహణ ప్రత్యేకాధికారులకు

వసతి గృహాల నిర్వహణ బాధ్యతల్ని పాఠశాల ప్రిన్సిపాళ్ల నుంచి ఎక్కడో దూరంగా ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాల ప్రత్యేకాధికారులకు అప్పగించడంతో సమస్యలు మరింత పెరిగాయి. వారు ఇటు కేజీబీవీలను అటు ఆదర్శ హాస్టళ్లను పర్యవేక్షించలేక సతమతమవుతున్నారు. సమస్యలు పరిష్కారం కాక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదర్శ పాఠశాలల ఆవరణలోనే వసతి గృహాలను నిర్మించారు. తొమ్మిదేళ్లపాటు నిర్వహణ బాధ్యతల్ని పాఠశాలల ప్రిన్సిపాళ్లకే అప్పగించారు. తాము వసతి గృహాల నిర్వాహకులం కాదంటూ ఈ బాధ్యతల నుంచి తమను తప్పించాలని ప్రిన్సిపాళ్లు కోర్టుకు వెళ్లారు. కోర్టు వీరికి అనుకూలంగా తీర్పునిచ్చింది. ప్రిన్సిపాళ్లతో హాస్టళ్లను నిర్వహింపచేయడమేంటని మొట్టికాయలు వేసింది. ఆ బాధ్యతల నుంచి తప్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే వీరి స్థానంలో కొత్తవారిని నియమించాల్సింది పోయి ప్రభుత్వం కస్తూర్బా గాంధీ విద్యాలయాల ప్రత్యేకాధికారులలకు బాధ్యతలను అప్పగించింది. ఆదర్శ పాఠశాలల వసతి గృహాలకు, కేజీబీవీలకు మధ్య దూరం మూడు నుంచి ఐదు కిలోమీటర్ల మేరకు ఉంది. ఇంకొన్ని చోట్ల వసతి గృహం ఒక ఊరిలో ఉంటే కేజీబీవీ మరో గ్రామంలో ఉంది. ఏక కాలంలో వీటిని నిర్వహించడం ప్రత్యేకాధికారులకు కష్టంగా మారింది. దీంతో ఆదర్శబడుల్లో పూర్తిస్థాయి హాస్టల్ వార్డెన్లు, నిర్వాహకులు లేక వాటి నిర్వహణ పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లయింది.

స్వీపర్ల తొలగింపుతో పారిశుధ్య నిర్వహణ మృగ్యం

మోడల్ స్కూళ్లకు గతంలో ప్రత్యేకంగా స్వీపర్ ఉండేవారు. వారికి ప్రతీ నెల రూ.2500 వరకు ప్రభుత్వమే చెల్లించేది. కొంత కాలం క్రితం అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు మోడల్ స్కూళ్లలో కూడా స్వీపర్లను తొలగించారు. పాఠశాలలను శుభ్రం చేసే బాధ్యతను పంచాయతీ సిబ్బందికి అప్పగించారు. ఇప్పటికే జీపీ సిబ్బందికి పనిభారం ఎక్కువగా ఉండటంతో ఈ పాఠశాలలో ఊడ్వడం, మరుగుదొడ్లను శుభ్రం చేయడం లాంటి పారిశుధ్య పనులను చేయడం లేదు. అటెండర్లే ఈ విధులను నిర్వహించాల్సి వస్తోంది.

బదిలీలు ఎప్పుడు?

పదకొండేళ్లుగా బదిలీలు లేకపోవడం వల్ల ఉపాధ్యాయుల్లో నిరాసక్తత, నైరాశ్యం ఏర్పడింది. ఈ ప్రభావం బోధనపై పడుతోంది. సుదీర్ఘ కాలం ఒక దగ్గరే పాతుకుపోయి ఉండడం వల్ల వారిలో నిర్లక్ష్యం కూడా కనిపిస్తోంది. సేవల విషయంలో కొందరు ఉపాధ్యాయులు కోర్టుకు వెళ్లడంతో బదిలీలకు బ్రేక్ పడింది. ఈ కేసు పరిష్కారమైతే తప్ప బదిలీలకు అవకాశం లేదు. ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో బదిలీలు జరుగుతున్నాయి. తమకు మాత్రం బదిలీల యోగం లేకపోవడంతో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నిరాశ చెందుతున్నారు. ఉపాధ్యాయ ఖాళీలను కూడా ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. పదేళ్లలో పలు కారణాల వల్ల ఖాళీ అయిన పోస్టులను ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. రాష్ట్రవ్యాప్తంగా 1200 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 200కుపైగా పోస్టులు ఖాళీ ఉండగా ఆ ఖాళీ స్థానాల్లో అవర్లీబేస్డ్ టీచర్లను నియమించి నెట్టుకొస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఆదర్శ పాఠశాలలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 30ఆదర్శ పాఠశాలలుండగా 24,600మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వరంగల్ జిల్లాలో అమీనాబాద్, వంచనగిరి, బుధరావుపేట, నెక్కొండ, పర్వతగిరి, గవిచర్ల, హనుమకొండ జిల్లాలో ముల్కనూరు, ఎల్కతుర్తి, కమలాపూర్, మహబూబాబాద్ జిల్లాలో చిలకోడు, కాల్వల, నేరేడ, మహబూబాబాద్, మరిపెడ, నర్సింహులపేట, నెల్లికుదురు, గుర్తూరు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గంగారం, దుబ్బలపాడు, ఎడ్లపల్లి, చిట్యాల, కొరికిరాల, ములుగు జిల్లాలో ఘనపూర్, చల్వాయి, బండారుపల్లి, జవహర్ నగర్, జనగామ జిల్లాలో పారుపల్లి, బచ్చన్నపేట, స్టేషన్ ఘనపూర్, చౌడారం, కొడకండ్ల, లింగాల ఘనపూర్, నర్మెట, వెల్ది, జఫర్‌గడ్ ఉన్నాయి. ఇక చేర్యాల మండలంలోని ముస్త్యాల, మద్దూరు మండలంలోని మద్దూరులోని మోడల్ స్కూళ్లు సిద్దిపేట జిల్లాలోకి వెళ్లాయి.

వంద మందికి మాత్రమే సరిపోయేలా వసతులు..

ఆంగ్ల మాధ్యమం ఉన్న నేపథ్యంలో ఈ పాఠశాలల్లో ప్రవేశాలకు తీవ్ర పోటీ ఉంటోంది. అందుకు తగినట్టు గా వసతులు కల్పించకపోతుండటంతో ప్రవేశాలు పొం దిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఒక్కో పాఠశాలలో వంద మంది విద్యార్థినులకు సరిపడా మాత్రమే హాస్టల్ సౌకర్యాలుండగా.. మిగతా వి ద్యార్థులు ఏ రోజుకా రోజు ఇళ్లకు వెళ్లి రావాల్సి వస్తోంది. కనీసం సమీపంలో బాలికలు, బీసీ వసతి గృహాలు లేకపోవడంతో వీరందరూ అవస్థలు పడుతున్నారు. బీసీ విద్యార్థులకు సీట్లు పరిమితంగా ఉండటంతో అత్యధికులకు నిరాశే ఎదురవుతోంది. ఒక్కొక్క ఆదర్శ పాఠశాలలో 820 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారిలో 60శాతం వరకు విద్యార్థినులే. ఆదర్శ పాఠశాలలు ఉన్న ప్రతీ మండలంలో బీసీ, బాలికల వసతి గృహాలను ఏర్పాటు చేస్తే సమస్య తీరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇళ్ల నుంచి రాకపోకలు విద్యార్థులు ప్రైవేటు వాహనాలను అద్దెకు మాట్లాడుకొని ప్రమాదకరమైన రీతిలో పాఠశాలలకు వస్తున్నారు. వీరికి వచ్చిపోయేందుకే సమయం సరిపోతుండటంతో చదువుకునేందుకు సమయం ఉండటం లేదు. ఆ ప్రభావం పరీక్ష ఫలితాలపై చూపుతోంది. ఇక దాదాపు అన్ని చోట్ల భవనాలు నిర్మించినా వాటి నిర్వహణ గురించి పట్టించుకోలేదు. గదులు మరమ్మతులకు వచ్చాయి. మూత్రశాలలు, మరుగుదొడ్ల అపరిశుభ్రతతో ఉపయోగించలేని రీతిలో ఉన్నాయి. నిర్వహణకు నిధులు కేటాయిస్తేనే ఈ సమస్య తీరే అవకాశం ఉంది. అప్పట్లో ప్రభుత్వం ఒక్కో పాఠశాల ఏర్పాటుకు 5 ఎకరాల స్థలం కేటాయించింది. ఈ స్థలంలో విద్యాలయాలు నెలకొల్పినా వసతి గృహాలను నిర్మించలేదు. మరికొన్ని చోట్ల వసతి గృహాలను ఏర్పాటు చేసినా వాటిని మాత్రం వినియోగంలోకి తీసుకురావడం లేదు. ఈ పరిస్థితుల కారణంగా మోడల్ స్కూళ్లలో ప్రవేశాల సంఖ్య క్రమంగా తగ్గుతోందని తెలుస్తోంది. ప్రస్తుతం ఇంటర్ విద్యార్థినులకు అదీ 100 మంది మాత్రమే హాస్టల్ వసతి ఉండడంతో పిల్లలను చేర్పేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఆంగ్ల మాధ్యమం బోధించే, హాస్టల్ వసతి కల్పించే ఇతర ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన స్కూల్ ఆఫ్ ఎక్సెలెన్సీ స్కూళ్లలో చేరుస్తున్నారు. ఆశ్రమ పాఠశాలలు ఊరికి దూరంగా ఉండడం కూడా ఒక కారణంగా చెబుతున్నారు. మోడల్ స్కూల్ భవనానికి విధిగా 5ఎకరాల స్థలం ఉండాలన్న నిబంధనలతో మండల కేంద్రాల్లో అంత స్థలాలు దొరక్క ఊరికి దూరంగా నిర్మించడం పెద్ద సమస్యగా మారింది.



విజయమాతగా భద్రకాళి

13వ రోజుకు శాకంబరీ ఉత్సవాలు

వరంగల్ కల్చరల్, జూలై 18: భద్రకాళి అమ్మవారి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు ఘనంగా సాగుతున్నారు. గురువారం నాటికి వేడుకలు 13వ రోజుకు చేరాయి. కాళీ క్రమాన్ని అనుసరించి ఉత్సవ మూర్తిని బలాకాగా అలంకరించి, భద్రకాళి మాతను విజయమాతగా అలంకరించారు. బలాకా అమ్మవారు పిడుగుల వర్షాన్ని కురిపించి శతృనాశనాన్ని చేస్తుందని, విజయమాత అమ్మవారు అనుగ్రహిస్తుందని ప్రధానార్చకులు శేషు తెలిపారు. అమ్మవారిని మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ లక్ష్మీకాంతరావు దంపతులు దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శేషుభారతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

కార్యకర్తల సమావేశంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మిల్స్‌కాలనీ/గీసుగొండ, జూలై 18: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని, పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ధర్మారంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్వేశ్వర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపించారు. ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇప్పటికే వాటిని అమలు చేయలేని అయోమయ పరిస్థితిలో ఉందన్నారు. జిల్లాలో శాంతి భద్రతలతోపాటు వైద్య, ఆరోగ్య సేవలు పూర్తిగా క్షీణించాయన్నారు. రైతులకు ఎలాంటి ఆంక్షలు పెట్టకుండా రుణమాఫీ చేయాలన్నారు. రైతులు గిట్టుబాటు ధర కల్పించాలని, ధరణి ప్రక్షాళన వెంటనే ప్రారంభించాలని, గొర్రెలు, చేప పిల్లల పంపిణీలో జరిగిన అవినీతిపై సత్వరమే విచారణ చేపట్టాలని కొండా డిమాండ్ చేశారు. జిల్లాలో అర్హులైన అన్ని కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. టెక్స్‌టైల్ పార్కులో భూమిని కోల్పోయిన గీసుగొండ, సంగెం మండలాలకు చెందిన రైతులకు వెంటనే తగిన నష్టపరిహారం చెల్లించాలన్నారు. మూడేళ్ల కింది నేషనల్ హెల్త్ స్కీం కింద నర్సంపేటలో నిర్మించిన 250పడకల ఆస్పత్రిలో అప్పుడే పెచ్చులూడుతున్నాయన్నారు. వరంగల్ మహానగరంలో సమస్యల్ని పరిష్కరించడంలో నగర పాలక సంస్థ పూర్తిగా విఫలమైందన్నారు. నగర రోడ్లు అధ్వానంగా తయారయ్యాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎంజీ అరూరి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రత్నం సతీష్‌సా, మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, నాయకులు డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, వన్నాల వెంకటరమణ, కంభంపాటి పుల్లారావు, కార్పొరేటర్లు జలగం అనిత, గందె కల్పన, పాల్గొన్నారు.

- చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. బీజేపీ సంస్థాగత పర్యటనలో భాగంగా గురువారం వరంగల్‌కు విచ్చేసిన ఎంపీ కొండాను ఓసిటీలోని ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి సత్కరించారు.
- శంభునిపేట : రంగశాయిపేటకు చెందిన మిట్టపల్లి కపిల్ గురువారం ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. మిట్టపల్లి కపిల్ ఆర్ఎస్ఎస్ నేతగా, గోసంరక్షక్ విభాగ్ ప్రముఖ్‌గా పనిచేశారు. అయ్యప్ప గురుస్వామిగా కపిల్ నగరవాసులకు సుపరిచితుడు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి కుమార్ ఆదేశాల మేరకు పనిచేస్తానని కపిల్ తెలిపారు.
- ఖిలావరంగల్ కోట చుట్టూ నిర్మించుకున్న ఇళ్లకు అనుమతులు ఇప్పించాలని రంగశాయిపేట కాలనీల డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షుడు కర్నె రవీందర్ ఆధ్వర్యంలో కమిటీ బాధ్యులు ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందించారు. కోట చుట్టూ పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న స్థలంతోపాటు పట్టా భూములను ఎఫ్‌టీఎల్‌లోకి ఏళ్ల క్రితం చేర్చారని చెప్పారు. విశ్వనాథకాలనీ, గణేష్‌నగర్, దూపకుంట ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణానికి మున్సిపల్ అధికారులు అనుమతులు ఇవ్వటం లేదని, పురావస్తు శాఖ ఎలాంటి అభ్యంతరం లేదని తెలపాలని కోరారు.

ఏనుమాముల మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్





యార్డులో వేరుశనగ రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్, దివ్యాగులకు ట్రై సైకిల్ అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

వరంగల్ కలెక్టరేట్, జూలై 18: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని వేరుశనగ క్రయవిక్రయాలను కలెక్టర్ సత్య శారద గురువారం పరిశీలించారు. లావాదేవీల రికార్డులను తనిఖీ చేశారు. వేరుశనగ ధర, మార్కెట్‌లో కల్పిస్తున్న సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లామార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, మార్కెట్ కార్యదర్శి నిర్మల పాల్గొన్నారు. అలాగే ఏనుమాముల మార్కెట్‌లో యార్డులోని జిల్లాకు సంబంధించిన వర్ధన్నపేట, వరంగల్ తూర్పు, నర్సంపేట అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌లను కలెక్టర్ పరిశీలించారు. ఎలక్షన్ పీరియడ్ పూర్తయ్యే వరకు భద్రతా సిబ్బంది అప్రమత్తంగాఉండాలని సూచించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. యార్డు ఆవరణలో జిల్లా సంక్షేమశాఖ, అలిమ్కో సంయుక్త ఆధ్వర్యంలో ఏడీఏఐతీ పథకం కింద జిల్లాలోని వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన 102 మంది దివ్యాంగులకు రూ. 42 లక్షల విలువైన బ్యాటరీ ట్రై సైకిళ్లను, రూ.2లక్షల 70వేల విలువైన ఆరు ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యశారద, కార్పొరేటర్ తూర్పాటి సులోచన, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, సంక్షేమ అధికారి హైమావతి, మార్కెటింగ్ అధికారి ప్రసాద్‌రావు, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

రుణమాఫీ అమలుకు పకడ్బందీ చర్యలు

రైతు రుణమాఫీని జిల్లాలో పకడ్బందీ అమలు చేయాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ, సహకార, బ్యాంకర్స్, సంబంధిత శాఖలతో రైతు రుణమాఫీ కార్యక్రమంపై తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 26వేల 396 మంది రైతులకు రూ.134.20 కోట్లు మొదటి విడత రైతు ఖాతాల్లో జమ అవుతున్నట్లు తెలిపారు. రైతు రుణమాఫీలో సమస్యలు ఉన్నట్లయితే ప్రత్యేక హెల్ప్‌లైన్ టోల్‌ఫ్రీ నెంబరు 1800 425 3434, మొబైల్ నెంబర్ 9154252936 ఏర్పాటు చేశామన్నా రు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషా దయాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ హెచ్.రాజు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సత్యం, వరంగల్ కో ఆపరేటివ్ బ్యాంక్ సీఈవో వజీర్ సుల్తాన్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, కెనరా బ్యాంకు మేనేజర్ మాధవి పాల్గొన్నారు.



నిలిచిన స్కానింగ్, ఎక్స్‌రేలు

బదిలీ కౌన్సెలింగ్‌కు వెళ్లిన వైద్యులు, రేడియోగ్రాఫర్

సీకేఎం ఆస్పత్రిలో నిరాశతో వెనుదిరిగిన గర్భిణులు, బాలింతలు

గిర్మాజీపేట, జూలై 18 : వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో గురువారం స్కానింగ్, ఎక్స్‌రే సేవలు నిలిచిపోవడంతో గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో స్కానింగ్, ఎక్స్‌రే సేవల కోసం వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన గర్భిణీలు, బాలింతలు స్కానింగ్‌లు చేసే వైద్యులు, ఎక్స్‌రే తీసే రేడియోగ్రాఫర్ లేకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లుగా పనిచేస్తున్న రేడియోలజిస్ట్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ వనజలు, రేడియోగ్రాఫర్ సిద్దార్థలు గురువారం హైదరాబాద్‌లో జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌కు వెళ్లడంతో స్కానింగ్, ఎక్స్‌రేలు సేవలు నిలిచిపోయాయి. ప్రతి రోజు ఆస్పత్రికి 500మంది ఇన్‌పేషంట్‌లు వైద్య పరీక్షలు, చికిత్స కోసం వస్తుంటారు. ఆస్పత్రిలో 200మంది ఇన్‌పేషంట్‌లు వైద్య చికిత్స పొందుతారు. నిత్యం100కు పైగా టిఫ, ఫిటల్ డాప్లర్, అబ్డామిన్, న్యూరో, రోటిన్ గర్భిణులకు స్కానింగ్‌లు చేస్తుంటారు. వేల రుపాయల వ్యయం అయ్యే అన్ని రకాల స్కానింగ్‌లు సీకేఎం ఆస్పత్రిలో ఉచితంగా చేస్తుండటంతో నిత్యం స్కానింగ్‌లకు రద్దీగా ఉంటుంది.

బదిలీ కౌన్సెలింగ్‌కు వెళ్లిన సిబ్బంది

ప్రస్తుతం జరుగుతున్న వైద్య ఆరోగ్యశాఖ బదిలీ కౌన్సెలింగ్‌లో భాగంగా రేడియాలజిస్టులు డాక్టర్ రాంబాబు, డాక్టర్ వనజ, రేడియోగ్రాఫర్ సిద్దార్థలు గురువారం హైదరాబాద్‌కు వెళ్లారు. దీంతో స్కానింగ్‌లు చేసేందుకు వైద్యులు లేకపోవడంతో ఆస్పత్రిలో నిత్యం జరిగే అన్ని రకాల స్కానింగ్‌లు నిలిచిపోయాయి. రేడియోలజీ వైద్యులు చేయాల్సిన అన్ని రకాల స్కానింగ్‌లు నిలిచిపోవడంతో గర్భిణీలు, ఇతర రోగులు వెనుదిరిగారు. అలాగే రేడియో గ్రాఫర్ కూడా కౌన్సిలింగ్‌కు వెళ్లడంతో ఎక్స్‌రే యూనిట్ గది తాళం తెరవలేదు. అయితే కాకతీయ వైద్య కళాశాలకు చెందిన రేడియాలజీ పీజీ వచ్చి సాధారణ స్కానింగ్‌లు 10వరకు తీశారు. గురువారం జరిగిన బదిలీ కౌన్సెలింగ్‌లో రేడియాలజీ వైద్యులు రాంబాబు, వనజలు సీకేఎం ఆస్పత్రి నుంచి బదిలీ అయ్యారు.

ఎంజీఎం సూపరింటెండెంట్, కేఎంసీ ప్రిన్సిపాల్ బదిలీ



చంద్రశేఖర్, మోహన్‌దాస్

వరంగల్ మెడికల్, జూలై 18: ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ ములుగు వైద్య కళాశాల ప్రొఫెసర్‌గా, కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్‌ను నర్సంపేట కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది. వీరి స్థానాల్లో ఇంకా ఎవరిని నియమించలేదు. 2021 జూలైలో కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా మోహన్‌దాస్ బాధ్యతలు స్వీకరించారు. కేఎంసీని అకడమిక్, పరిపాలన, అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపి పలువురి మన్ననలు పొందారు. ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా చంద్రశేఖర్ ఏప్రిల్ 2022లో ఎఫ్ఏసీగా బాధ్యతలు స్వీకరించారు. పలు వివాదాల మధ్య ఎంజీఎం పాలన కొనసాగించారు. ఎంజీఎం, కేఎంసీలలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సీనియర్ ప్రొఫెసర్లు 36మంది బదిలీ అయ్యారు. వీరి స్థానంలో కొత్తవారు రానున్నారు. సుదీర్ఘకాలంగా ఇక్కడ పని చేస్తుండటంతో ములుగు, జనగామ, భూపాలపల్లి, మహబూబాబాద్ వైద్య కళాశాలలకు బదిలీ అయ్యారు.

కాకతీయ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ యాదగిరి భూపాలపల్లి వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. ఎంజీఎం అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం కరీంనగర్ వైద్య కళాశాలకు బదిలీ కాగా, కేఎంసీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నోడల్ అధికారిగా పనిచేస్తున్న గోపాల్‌రావు జనగామ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. అలాగే, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి డిప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ అంబరీష్ బదిలీపై వచ్చారు. డాక్టర్ అంబరీష్ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తున్నారు. వరంగల్ సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంవోగా హనుమకొండ జిల్లాలో పని చేస్తున్న డాక్టర్ యాకూబ్‌పాషా బదిలీపై వచ్చారు. వైద్య, ఆరోగ్యశాఖలో వివిధ విభాగాలకు చెం దిన మరికొంత మంది ఈనెల 20లోపు బదిలీ కానున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

వర్షాల నేపథ్యంలో టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు : బల్దియా కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: నగరంలో వచ్చే రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, ఈ మేరకు బల్దియా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. గురువారం బల్దియా కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఎమర్జెన్సీ బృందాలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన టోల్ ఫ్రీ 18004251980, 9701999645 నెంబర్‌లకు వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అన్నారు. విపత్తు బృందాలు పంపించి సమస్య పరిష్కరించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా షర్మిల.. ఆర్ఎంవోగా యాకుబ్ పాషా

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష

వివరాలు: 7లో

రుణమాఫీతో సంబరాలు..






చెన్నారావుపేటలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, పర్వతగిరిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ కార్యక్రమాన్ని గురువారం అట్టహాసంగా ప్రారంభించింది. రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడంతో రైతులు సంబరాల్లో మునిగారు. జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు రైతులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి, స్థానిక ప్రజా ప్రతినిధుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. అలాగే రైతు వేదికల్లో సీఎం టెలీకాన్ఫరెన్స్‌ను వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. చెన్నారావుపేట రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రైతులు, నాయకులతో కలిసి వీక్షించారు. అలాగే, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వర్ధన్నపేటలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రైతు వేదిక వద్ద రుణాలు మాఫీ చేయడంతో సంబరాల్లో పాల్గొన్నారు. అలాగే పర్వతగిరిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి బాణాసంచా పేల్చారు.

-వరంగల్ వ్యవసాయం





అటవీ శాఖలో బదిలీలు

వరంగల్ క్రైం, జూలై 18: భద్రాద్రి కొత్తగూడెం జోన్ పరిధిలోని అటవీ శాఖలో ఉద్యోగుల బదిలీలు జరిగాయి. గురువారం హనుమకొండ అటవీ శాఖ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. జోన్ పరిధిలోని హనుమకొండ, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో జరిగిన బదిలీల్లో 106 మంది స్థాన చలనం చెందారు. బదిలీ అయిన వారిలో 27 డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, 53 సెక్షన్ ఆఫీసర్లు, 19 సీనియర్ అసిస్టెంట్లు, 7 సూపరింటెండెంట్లు ఉన్నారు.





నేడు ఒకేషనల్ కళాశాలలో జాబ్‌మేళా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్, జూలై 18: ఈనెల 19న హనుమకొండ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో 2021-22, నుంచి 2023-24లో ఇంటర్మీడియెట్ ఒకేషనల్ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అప్రెంటిషిప్ జాబ్‌మేళా-2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ బెడుదం శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ఆవరణలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.7చొప్పున ఆర్‌డీఎస్‌డీ సంస్థ వారు శిక్షణకాలంలో ఇస్తారని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులందరూ రెండు జతల బయోడెటాతోపాటు రెండు ఫొటోలు, ఇంటర్, ఎస్సెస్సీ, ఆధార్‌కార్డుతోపాటు ఇతర విద్యార్హతల ధృవపత్రాలను తీసుకునిరావాలని సూచించారు. జాబ్‌మేళా కళాశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. ఉదయం సెషన్‌లో పారామెడికల్, సాయంత్రం సెషన్‌లో ఇంజనీరింగ్, కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అప్రెంటిషిప్ సాగుతుందని స్పష్టం చేశారు. కాగా, విద్యార్థులు జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని డీఐఈఓ ఎ.గోపాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వృత్తి విద్యాకళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ పి.దివాకర్, ఎన్ఎస్ఎప్ పీవో డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు ఎం.విష్ణుకాంత్, ఎం.రాజేంద్రప్రసాద్, పి.విజయకుమార్, ఎ.దిలీప్, ఖాదర్‌బాబా, డి.రవి, చౌహన్, మహేందర్, జయపాల్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రిటైర్డు ప్రొఫెసర్ సుభాష్ మృతి

నివాళులర్పించిన ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీ బయో టెక్నాలజీ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ కారంపూడి సుభాష్ (76) గుండెపోటుతో మృతి చెందారు. గత 16న హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడివగా దుబ్బాకలోని తన స్వగృహంలో అంత్యక్రియలు నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. సుభాష్‌కు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.

1970లో వర్సిటీలో లెక్చరర్‌గా ఉద్యోగంలోకి చేరిన సుభాష్. ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. వర్సిటీలో బాటనీ, బయోటెక్నాలజీ విభాగంలో బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్‌గా, వర్సిటీ అభివృద్ధి అధికారిగా, వసతి గృహాల సంచాలకుడిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. ప్రొఫెసర్ సుభాష్ కేయూ పూర్వపు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జాఫర్ నిజాం పర్యవేక్షణలో డాక్టరేట్ సాధించారు. మృతి చెందిన ప్రొఫెసర్ సుభాష్ మృతికి సంతాపంగా గురువారం కేయూ బయో టెక్నాలజీలో విభాగాధిపతి డాక్టర్ శాస్త్రి తాడూరి నేతృత్వంలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ నూనె రామస్వామి, ప్రొఫెసర్ సదానందం, డాక్టర్ పొడేటి శ్రీనివాస్, ప్రొఫెసర్ క్రిష్టోఫర్ తదితరులు పాల్గొన్నారు.

మొగిళిచర్లలో అనధికారిక లేఔట్ తొలగింపు

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిళిచెర్ల శివారులో సర్వే నెంబర్ 178/2సి, 179సిలో మూడెకరాల విస్తర్ణంలో ఉన్న వ్యవసాయ భూమిలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన లేఔట్ ప్లాట్ల హద్దు రాళ్లను గురువారం బల్దియా అధికారులతో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించారు. అనుమతి లేకుండా ప్లాట్లు చేసినందుకు గాను లేఔట్‌ను తొలగించినట్లు ఏసీపీ ఖలీల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీబీవో ఖాజాషరీఫ్, చైన్‌మెన్ ప్రశాంత్‌తో పాటు డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

21న సింగర్ సనశ్రీ 8 గంటల నాన్‌స్టాప్ పాటలు

వడ్డెపల్లి, జూలై 18: హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కాలేజీలో ఈనెల 21న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 108 పాటలను నిరంతరంగా సింగర్ సనశ్రీ ఆలాపించనున్నట్లు కాకతీయ మ్యూజికల్ క్లబ్ సభ్యులు తెలిపారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సింగర్ సనశ్రీ మాట్లాడుతూ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ , తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఈ మూడు బుక్స్‌రికార్డ్స్ కోసం 108 మల్టీ లాంగ్వేజ్ పాటలను నాన్‌స్టాప్‌గా 8 గంటల పాటు ఆలాపించనున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో తోట పూర్ణచందర్‌రావు, సిరాజొద్దీన్, తిరుపతయ్య, రంగు రఘుపతి, రాంమూర్తి, శ్రీమన్నారాయణ పాల్గొనున్నారు.











పరీక్షలు ముగిసిన విద్యార్థులు హాస్టల్ ఖాళీ చేయాలి..

కేయూ క్యాంపస్, జూలై 18: కాకతీయ యూనివర్సిటీలో తాజాగా పీజీ రెండో ఏడాది పరీక్షలు ముగిసిన విద్యార్థులు జూలై 20వ తేదీలోగా హాస్టళ్లు ఖాళీ చేయాలని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీ చేసిన విద్యార్థులు హాస్టల్ గదుల తాళాలను కేర్ టేకర్లు అప్పగించాలని స్పష్టం చేశారు. వర్సిటీ ఆదేశాలు పాటించని విద్యార్థుల గదులను స్వాధీనం చేసుకుని వర్సిటీ అధికారులే తాళాలు వేస్తామని పేర్కొన్నారు. తర్వాత వర్సిటీలో తలెత్తేపరిణామాలకు సిబ్బంది బాధ్యత ఉండదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

ఐటీఐలో రెండో విడత ప్రవేశాల గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో రెండో విడత ప్రవేశాల దరఖాస్తుల గడువును ఈ నెల 21 వరకు పొడిగించినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ జి.సక్రు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు http://iti.telangana.gov.in వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయురాలికి కలెక్టర్ ఆదేశాల మేరకు డీఈవో వాసంతి షోకాజ్ నోటీసు జారీ చేశారు. హనుమకొండలోని వడ్డెపల్లి ఉర్దూ మీడియం ప్రైమరీ పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసియా సిద్ధిఖి అనే ఉపాధ్యాయురాలు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్నట్లు గుర్తించారు. వర్క్ బుక్‌లను ఉపయోగించకపోవడం, విద్యార్థులకు వర్క్ బుక్స్‌ను ఇవ్వకపోవడం, పాఠశాల మౌలిక వసతులు పట్ల అవగాహన రాహిత్యాన్ని గుర్తించిన కలెక్టర్ ప్రావీణ్య.. ఉపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించడంతో డీఈవో డి.వాసంతి ఆమెకు షోకాజ్ నోటీసు జారీ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, జూలై 18: షుగర్, గుండెవ్యాధుల ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 19న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు ఎండోక్రైనాలజిస్టు డాక్టర్ ఇ.లక్ష్మణ్ కుమార్, కార్డియాలసిస్టు డాక్టర్ పీవీ అనిల్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ.5వేల విలువైన పరీక్షలను ఉచితంగా నిర్వహించడంతోపాటు, మరో రూ.1500 విలువైన రెటినోపతి కంటి పరీక్షను సైతం ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు 9955996166, 91338933లలో సంప్రదించాలన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

న్యూశాయంపేట, జూలై 18: కుల గణన చేపట్టి రిజర్వేషన్లు పెంచిన తర్వాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అధ్యక్షతన సమగ్ర కుల గణన యాత్ర సభ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీలు దూరం కావడంతోనే గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి మెజారిటీ తగ్గిందని, ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కళ్లు తెరిచి బీసీలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. బీసీలుఅంటే బ్రిలియంట్ క్యాస్ట్ అని.. బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదన్నారు. బీసీలకు ఉన్న తెలివి ప్రపంచంలో ఎవరికీ లేదని, దమ్ము ధైర్యం ఉన్న కులం బీసీ కులం అన్నారు. గత శాసనసభఎన్నికల ముందు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే 6 నెలల్లోపు కులగణన చేపడుతామని చెప్పారని, ఆ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీసీలు పోరాటం చేస్తారని హెచ్చరించారు.

ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకాల శ్యామ్ కుర్మా, బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర నాయకులు కుందారపు గణేష్‌చారి, బాలగాని బాలరాజు గౌడ్, సగర శేఖర్, వడ్నాల నరేందర్, డాక్టర్ చిర్ర రాజు, బీసీ సంక్షేమ సంఘం చిల్పూర్ మండల అధ్యక్షుడు బత్తుల రాజన్‌బాబు, దాడి మల్లయ్య, నాగరాజు, శోభారాణి, పద్మజతో పాటు పెద్ద సంఖ్యలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కరుణకు విజ్ఞప్తి



వాకాటి కరుణకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి తదితరులు

హనుమకొండ సిటీ, జూలై 18: అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఉద్యోగ విరమణ తరువాత లభించే ఆర్థిక ప్రయోజనాల అమలుకు సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వాకాటి కరుణకు తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ప్రధాన కార్యదర్శి రమాతార విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో వాకటి కరుణను కలిసి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, కేంద్రాలకు సంబంధించిన సమస్యల పరిష్కార చర్యలను చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందచేశారు. రిటైర్మెంట్ అయిన టీచర్లకు రూ.2లక్షలు, హెల్పర్లకు లక్ష రూపాయలను ప్రభుత్వం అందచేయనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలియచేశారు. అయితే ఇందుకు సంబంధించిన జీవోను కూడా వెంటనే విడుదల చేయాలని కోరారు. అనారోగ్య సమస్యలతో ఉన్న టీచర్లు, హెల్పర్లకు వాలంటరీ రిటైర్మెంట్ ఇవ్వాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, టీచర్లకు అదనపు పనులు అప్పగించరాదని, కేంద్రాల్లో వసతులు కల్పించాలనే తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి వేదవతితో పాటు ఎల్లమ్మ, శిరీష, పుష్ప, నాగలక్ష్మి, చిన్నమ్మడు, అనిత తదితరులు పాల్గొన్నారు.

అడవి జంతువుల కోసం 'వేట'కుక్కలు..



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల వేటగాళ్లు విచ్చలవిడిగా అడవి జంతువులను మట్టుబెట్టి యథేచ్ఛగా వాటి మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు అడవి జంతువుల కోసం ఉచ్చులు బిగిస్తుంటే.. మరికొందరు విద్యుత్ వైర్లు అమరుస్తున్నారు. ఇంకొందరైతే ఏకంగా వేటకుక్కలను వినియోగిస్తూ అడవి జంతువులను వేటాడుతున్నారు. గురువారం వరంగల్ జిల్లా గీసుగొండ మండలం పల్లెగుట్ట సమీపంలో కొందరు వేటగాళ్లు అడవి జంతువుల ఇదిగో ఇలా సుమారు పది కుక్కలను వదలగా.. అవి పొలాలను జల్లెడపడుతూ కనిపించాయి. అయితే అటవీ అధికారులు స్పందించి వేటగాళ్లను కట్టడి చేసి అడవి జంతువులను కాపాడాలని జంతు ప్రేమికులు, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

ఫొటో : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ



హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో శిశువు రగడ

మగ శిశువుకు బదులు, ఆడ మృత శిశువునిచ్చారని బంధువుల ధర్నా

వరంగల్ మెడికల్, జూలై 18: తమకు మగ శిశువు పుడితే చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని తల్లిదండ్రులు హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా తరిగొప్పుల మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన అనూష. బుధవారం ప్రసవం కోసం హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేరారు. వైద్యులు ప్రసవం చేశారు. అయితే చనిపోయిన ఆడ శిశువుడును ఇచ్చారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తమకు మగశిశువు పుట్టాడని, ఈ స్థానంలో చనిపోయిన ఆడ శిశువును ఇచ్చారని కన్నీటిపర్యంతం అయ్యారు. వివాహ అనంతరం ఏడేళ్ల తర్వాత గర్భం ధరించిందని, ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే ఇలా చేశారని ఆరోపిస్తున్నారు. కాగా, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు అనుమానం ఉంటే డీఎన్ఏ పరీక్షలకైనా తాము సిద్ధమే అన్నారు. కుటుంబసభ్యులకు ముందుగానే సమాచారం ఇచ్చామని వివరించారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీ బృందం



గంగదేవిపల్లిని సందర్శించిన విదేశీబృందం

గీసుగొండ, జూలై 18: జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని ఇటలీ, సిసిలియా, ఎరిత్రియా దేశాలకు చెందిన ప్రతినిధి బృందం గురువారం సందర్శించింది. బాలవికాస సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2 వారాల పాటు కమ్యూనిటీ డ్రీవెన్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన విదేశీ బృందం ఫీల్డ్‌విజిట్‌లో గంగదేవిపల్లిని సందర్శించినట్లు జిల్లా ట్రెయినింగ్ మేనేజర్ కూసం రాజమౌళి తెలిపారు. ఈ సందర్భంగా వారికి గ్రామాభివృద్ధిలో ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యం, గ్రామాభివృద్ధి కమిటీల పనితీరును, సాధించిన అవార్డులు, నగదు పురస్కారాలను రాజమౌళి వివరించారు. కార్యక్రమంలో బాలవికా స సంస్థ డైరెక్టర్ సింగారెడ్డి సునీత, ఆశలత, సుజాత, దీప, రిసోర్స్ పర్సన్స్ గూడ సరోజన, వితంతువుల కమిటీ అధ్యక్షురాలు మేడిద సుశీల పాల్గొన్నారు.

భద్రత చెక్కు అందించిన సీపీ



చెక్కు అందిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, జూలై 18: గత నెలలో అనారోగ్యంతో మరణించిన ఏఆర్ కానిస్టేబుల్ రాజు కుటుంబానికి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రూ.7లక్షల 89వేల భద్రత చెక్కును అందచేశారు. గురువారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో రాజు సతీమణి మాధవికి కమిషనర్ చెక్కు అందించారు. వారి కుటుంబ సభ్యుల పరిస్థితిని తెలుసుకున్న కమిషనర్.. మిగతా బెనిఫిట్స్ తొందరగా అందించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పరిపాలన విభాగం ఏవో రామకృష్ణ స్వామి, సెక్షన్ సూపరింటెండెంట్ జలజ, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శోభన్ తదితరులు పాల్గొన్నారు.

సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా షర్మిల

ఆర్ఎంవోగా యాకుబ్ పాషా.. బదిలీపై రానున్న వైద్యులు

గిర్మాజిపేట, జూలై 18: వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.షర్మిల, ఆర్ఎంవోగా డాక్టర్ యాకుబ్ పాషాలు నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ బదిలీల్లో ప్రొఫెసర్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న గైనకాలజీ అండ్ అబ్‌స్ట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ టి.నిర్మలాకుమారి.. నర్సంపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ గాంధీ వైద్య కళాశాలలో గైనకాలజీ అండ్ అబ్‌స్ట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ జి.షర్మిల వరంగల్ సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. అలాగే డిప్యూటీ సివిల్ సర్జన్ కేడర్‌లో ప్రస్తుత సీకేఎం ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్యామ్ కుమార్ జనగామ డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న డాక్టర్ యాకుబ్ పాషా ఆర్ఎంవోగా వస్తున్నారు. అలాగే సివిల్ అసిస్టెంట్ సర్జన్ కేడర్‌లో సీకేఎం ఆస్పత్రి రేడియాలజీ డాక్టర్ రాంబాబు దామెర పీహెచ్‌సీకి, డాక్టర్ వై.వనజ హసన్‌పర్తి పీహెచ్‌సీకి, పీపీ యూనిట్ డాక్టర్ శ్రీదేవి కడిపికొండ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. కాగా, సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి రేడియోగ్రాఫర్ సిద్ధార్థ 40 శాతం బదిలీల్లో లేకపోవడంతో గురువారం జరిగిన కౌన్సెలింగ్‌లో సీకేఎం ఆస్పత్రిలోనే యథావిధిగా కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం నర్సింగ్ అధికారులు, శనివారం ఫార్మసిస్టులు, ల్యాబ్‌టెక్నీషియన్‌లు, సీనియర్ అసిస్టెంట్‌లకు బదిలీ కౌన్సెలింగ్ జరగనుంది.

21న జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్

వరంగల్ స్పోర్ట్స్, జూలై 18: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు చీఫ్ ఆర్బిటర్ చిన్న రాముల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20న ప్రపంచ చదరంగం(చెస్) దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాల స్థాయిలో అండర్-7, 9, 11, 13 బాలబాలికల విభాగాల్లో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన క్రీడాకారులు శుక్రవారం టీటీడీ కల్యాణ మండపంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 9963214108 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన డీఎస్సీ పరీక్ష

మొదటి సెషన్‌లో 89.6, రెండో సెషన్‌లో 89.13 శాతం మంది హాజరు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 18: ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ-2024 జిల్లాలో గురువారం నుంచి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలో 5 పరీక్ష కేంద్రాల్లో సీబీటీ పద్ధతిలో నిర్వహిస్తున్న పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఉదయం పూట సెషన్‌లో 1,206 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 1,038 మంది హాజరు కాగా 168 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పూట నిర్వహించిన రెండో సెషన్‌లో ఒకే ఒక సెంటర్‌లో 138 మంది అభ్యర్థులకు గాను 123 మంది హాజరయ్యారు. మొదటి రోజు తొలి సెషన్‌లో 89.6 శాతం, మలి సెషన్‌లో 89.13 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం పూట సెషన్‌లో చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ పరీక్ష కేంద్రంలో 102 మంది, అయాన్ డిజిటల్ సెంటర్‌లో 216, జయ ఇనిస్టిట్యూట్ కేంద్రంలో 210, మోక్షిత సెంటర్‌లో 387, నోబెల్ టెక్నాలజీస్ సెంటర్‌లో 153 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. మధ్యాహ్నం పూట సెషన్‌లో అయాన్ డిజిటల్ కేంద్రంలో 123 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమైనట్లు స్థానిక నిర్వాహకురాలు డి. వాసంతి తెలిపారు.

యాప్, వెబ్ సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా అవగాహన కల్పించాలి..

హనుమకొండ టౌన్, జూలై18 : టీజీ ఎన్పీడీసీఎల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని నోడల్ ఆఫీసర్లను సీఎండీ ఆదేశించారు. గురువారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో నోడల్ ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఏ విధంగా బిల్లు చెల్లించేలా అనే దానిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్స్‌లో భాగంగా ఫీడర్లపై అంతరాయాలను తగ్గించడానికి ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర ఏబీ స్విచ్‌లు మరమ్మతులు చేసుకొని, వాటిని ఓపెన్ చేసుకొని పని చేయడం ద్వారా అంతరాయాలు తగ్గుతాయన్నారు. ప్రతీ సర్కిల్‌లో ఇలా చేయడం ద్వారా అంతరాయాలు కనిష్టస్థాయికి తగ్గుతాయన్నారు. విద్యుత్ అంతరాయాలపై ఎప్పటికప్పుడు కిందిస్థాయి సిబ్బందికి మార్గనిర్దేశం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, సీజీఎంలు తిరుమల్‌రావు, కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుట్ట, జీఎంలు గౌతమ్‌రెడ్డి, నాగప్రసాద్, వేణుబాబు, దేవేందర్, మాధవరావు, అన్నపూర్ణ, డీఈ (టి) శ్రీధరాచారి తదితరులు పాల్గొన్నారు.



ములుగులో బాణాసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు



లింగాల ఘనపురంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

మాఫీ జరిగె.. పండుగ వచ్చే..



మహబూబాబాద్ రైతువేదికలో పాల్గొన్న కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, ఎమ్మెల్యే మురళీనాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి



దేవరుప్పులలో పొలం వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకుల సంబురాలు



హనుమకొండలోని డీసీసీబీ కార్యాలయం ఎదుట జరిగిన సంబరాల్లో డప్పు కొడుతున్న టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఎన్నికల హామీగా కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన మాట మేరకు రూ.2లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టింది. గురువారం రూ.లక్షలోపు రుణాలను మాఫీ చేస్తూ 'రుణమాఫీ పండుగ' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో గ్రామాల్లో సీఎం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు చిత్రపటాలు, ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యేలు, నేతలు ర్యాలీలు.. ఎద్దులబండ్లతో ఊరేగింపులు నిర్వహించారు. బాణసంచా కాల్చారు. మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా రైతులు కూడా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక రైతువేదికల్లో జరిగిన కార్యక్రమాలకు హాజరైన రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సీఎంతో మాట్లాడి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు.



భూపాలపల్లి జిల్లా చిట్యాలలో జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



తొర్రూరు మండలం మాటేడులో ఎద్దులబండిపై నుంచి రైతులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



ఆత్మకూరు మండలం హౌజ్‌బుజుర్గ్ గ్రామంలో బైకు ర్యాలీలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

మీకు రుణపడి ఉంటాం..

రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తాం

సీఎం రేవంత్‌తో బొల్లికుంట రైతు ఎల్లయ్య



సీఎం రేవంత్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైతు ఎల్లయ్య

శంభునిపేట, జూలై 18: రైతులకిచ్చిన మాట నిలుపుకొన్న సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటామని వరంగల్‌లోని ఉర్సు ప్రాంతానికి చెందిన రైతు బొల్లు ఎల్లయ్య అన్నారు. రుణమాఫీ సందర్భంగా గురువారం ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో మాట్లాడగా అందులో భాగంగా వరంగల్‌కు చెందిన రైతు బొల్లు ఎల్లయ్య మాట్లాడుతూ.. రైతులకు ఒకే విడతలో రుణమాఫీ చేసి రైతులకు మేలు చేసిందని, సీఎంతో చెప్పారు. జోడో యాత్ర సభలో భాగంగా వరంగల్‌లో నిర్వహించిన సభలో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రైతు రుణమాఫీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. తాము రాహుల్ గాంధీని ప్రధానిని చేస్తామని, ఆయన్ను వరంగల్‌కు మళ్లీ తీసుకురావాలని రేవంత్ రెడ్డిని కోరారు. అందుకు స్పందించిన సీఎం రేవంత్... రైతు రుణమాఫీ వరంగల్ డిక్లరేషన్‌లోనే చెప్పామని అధికారంలోకి వచ్చి చేశామని గుర్తు చేశారు. రాహుల్‌గాంధీని వరంగల్ తీసుకొస్తే సభను విజయవంతం చేస్తారా అని ఎల్లయ్యను అడుగగా.. 5లక్షల మంది రైతులను తీసుకువస్తాం అని ఎల్లయ్య సమాధానం ఇచ్చారు.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY

వరంగల్ సిటీ

8

• వరంగల్ • ఖిలావరంగల్ • గీసుగొండ • సంగెం

శుక్రవారం 19 జూలై 2024



అంగన్‌వాడీ సెంటర్‌లో మొక్కను నాటుతున్న దృశ్యం

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

శంభునిపేట, జూలై 18: ప్రభుత్వం సంక్షేమ పథకాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని 41వ డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ అన్నారు. గురువారం ఉర్సు సెక్టార్ సూపర్‌వైజర్ బత్తిని రమాదేవి అధ్యక్షతన శంభునిపేట అంగన్‌వాడీ-2 సెంటర్‌లో అమ్మబాట- అంగన్‌వాడీ బాడిబాట ర్యాలీ నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లలకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీలో విద్యను ఆటపాటలతో అంగన్‌వాడీలో అందిస్తారన్నారు. అనంతరం ఆవరణలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆయాలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శబ్ద కాలుష్యానికి పాల్పడేవారిపై చర్యలు

వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ



సైలెన్సర్లను ధ్వంసం చేయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మట్టెవాడ, జూలై 18: శబ్ద, వాయు కాలుష్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం వరంగల్ ఎంజీఎం జంక్షన్‌లో ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక తనిఖీల్లో పట్టుబడ్డ 150 సైలెన్సర్లను రోడ్డు రోలర్‌తో ట్రాఫిక్ పోలీసులు ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. శబ్ద కాలుష్యాన్ని పెంచుతున్న సైలెన్సర్లను వాహనాలకు అమరిస్తే చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. నగరంలో శబ్ద కాలుష్యాన్ని పెంచుతున్న వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, ట్రాఫిక్ ఎస్సైలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 12 మందికి జరిమానా

మట్టెవాడ, జూలై 18: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 12 మందికి వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రాపు వీరాస్వామి రూ.17,500 జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె.రామకృష్ణ గురువారం తెలిపారు. అలాగే వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.4వేల చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు.

నలుగురు దొంగల అరెస్ట్



నిందితుల అరెస్ట్‌ను చూపుతున్న సీఐ బాబులాల్

గీసుగొండ, జూలై 18: జిల్లాలో పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు సీఐ బాబులాల్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం. గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ జానీపాష ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా స్కూటీలపై వెళ్తుండగా పోలీసులు విచారించారు. విచారణలో కాశిబుగ్గకు చెందిన పల్లకొండ ఉపేందర్, పల్లకొండ వంశీ, పులిచేరు ప్రసాద్, జూలూరి ధనుష్‌లు పలు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. వీరు గొర్రెకుంటలోని టీఎస్ఎన్‌పీడీసీఎల్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ షెడ్‌లో కాపర్ వైర్లను, గోపాల్‌రెడ్డినగర్‌లో, హరిహర ఎస్టేట్‌లో అపర్ణ అపార్ట్‌మెంట్‌లో ఇంటి తాళాలను పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు విచారణలో తేలినట్లు సీఐ చెప్పారు. రెండు స్కూటీలను సీజ్‌చేసి వారిని కోర్టులో హాజరుపరిచనట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ జానీపాష, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య



భాస్కర్ (ఫైల్)

గిర్మాజిపేట, జూలై 18 : వరంగల్ జీఆర్‌పీ పరిధిలోని చింతల్‌పల్లి సం గెం రైల్వేగేటు సమీపంలో గురువారం రైలు కిందపడి అవివాహితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం సంగెం మండల కేంద్రానికి చెందిన మెట్టుపల్లి భాస్కర్ (51) రెండేళ్ల నుంచి గొంతు క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అనారోగ్యం కారణంగా జీవితంపై విరక్తిచెందిన భాస్కర్ గురువారం ఉదయం సంగెం రైల్వేగేటు సమీపంలో అప్‌లైన్‌లో బిలాస్‌పూర్ ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ తెలిపారు. ఎంజీఎం మార్చురిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తమ్ముడు మెట్టుపల్లి ప్రవీణ్‌కు అప్పగించి అతడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.అయిలయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడుగా పనిచేస్తున్నట్లు తెలిసింది.

శ్మశానవాటికలపై పట్టింపేదీ?

• కరువైన మౌలిక వసతులు • అస్తవ్యస్తంగా రోడ్డు, స్నానాల గదులు

• స్థల వివాదంతో నిలిచిన అభివృద్ధి పనులు • ఏళ్లనుంచి కుమ్మరికుంట శ్మశానవాటిపై పాలకుల నిర్లక్ష్యం

ఖిలావరంగల్, జూలై 18: కనీస సౌకర్యాలు లేక 37, 38 డివిజన్లకు చెందిన ఎస్సీ (దళితులు) కుమ్మరికుంట శ్మశానవాటిక అధ్వానంగా మారింది. శ్మశాన వాటికి అభివృద్ధికి నోచుకోక ఏళ్ల నుంచి మౌలిక వసతులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమాధులకు స్థలం లేకపోవడంతో స్థానిక దళిత పెద్దలు 2018లో అప్పటి ఎమ్మెల్యే కొండా సురేఖకు పరిస్థితిని వివరించారు. దీంతో సురేఖ కుమ్మరికుంట చెరువు సమీపంలో కొంత ప్రభుత్వ స్థలాన్ని సమాధుల కోసం కేటాయించారు. అలాగే అభివృద్ధి పనుల కోసం అదే సంవత్సరం రూ.63లక్షలు కేటాయించారు.



అధ్వానంగా ఉన్న కుమ్మరికుంట శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డు



ముళ్లపొదల మధ్యన ఉన్న కుమ్మరికుంట శ్మశాన వాటిక

ఆరేళ్ల క్రితం కుమ్మరికుంట శ్మశానవాటిక రోడ్డు, విద్యుత్‌దీపాలు, స్నానాల గదులు, బోర్, సెంట్రల్ లైటింగ్ తదితర పనులను చేపట్టారు. గతంలో పనులు జరుగుతున్న క్రమంలో దళితులకు స్థానిక రైతులకు చెరువు, స్థల విషయమై గొడవ జరగడంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం అరాకొర వసతుల నడుమనే అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.

దారిలేక ఇబ్బందులు

శ్మశానవాటికకు సరైన దారిలేక దళితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా చనిపోతే గుంత



ఖిలావరంగల్ ఎస్సీ కాలనీలోని శ్మశాన వాటిక

తవ్వడం, సమాధి చేసే పెట్టె తదితర ఏర్పాట్లు తో పాటు దారిలేక పోవడంతో ఇబ్బందిపడుతున్నారు. సమాధి వద్దకు వెళ్లే కాలిబాట ముళ్లపొదలతో నిండిపోయిందని వాపోతున్నారు. కుమ్మరికుంట శ్మశానవాటిక దారి చెత్తా, చెదారంతో నిండి ఉంది. మనుషులు వెళ్లేందు కు కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయి న కొండా సురేఖ సమస్య పరిష్కారానికి చొరవచూపి, అభివృద్ధి పనులను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

హిందూ శ్మశాన వాటికదీ అదే దుస్థితి..

కుమ్మరికుంటలో బీసీలకు చెందిన శ్మశానవాటికను సైతం అధ్వానంగా మారింది. పదేళ్ల క్రితం నిర్మించిన ఈ శ్మశానవాటికకు వెళ్లేందుకు కనీసం దారి కూడా లేదని వాపోతున్నారు. బోర్ వేసి, స్టాటిక్‌ట్యాంక్, బట్టలు మార్చుకునేందుకు గదులను ఏర్పాటుచేయాలని ఖిలావరంగల్ వాసులు కోరుతున్నారు.

సంఘం, సొసైటీపై ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న గుండా ప్రకాశ్‌రావు

మట్టెవాడ, జూలై 18: వరంగల్ పట్టణ ఆర్యవైశ్య సంఘం, హౌసింగ్ సొసైటీపై వస్తున్న ఆరోపణలు అవాస్తమని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, మాజీ మేయర్ గుండా ప్రకాశ్‌రావు అన్నారు. గురువారం వరంగల్ ఆర్ఎన్‌టీ రోడ్డులోని వైశ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకాశ్‌రావు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం హౌసింగ్ సొసైటీ బొల్లికుంట పేజ్-1 250 మంది సభ్యులకు, గంగాదేవిపల్లిలో 130 మంది సభ్యులకు స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేశామన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. హౌసింగ్ సొసైటీ పేజ్-2 బొల్లికుంటకు సంబంధించిన స్థలాల రిజిస్ట్రేషన్ తుదిదశలో ఉన్నాయని త్వరలోనే స్థలాల రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పారు. ఈనెల 21న బొల్లికుంట పేజ్-1లో ప్లాట్‌లలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, అలాగే మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. సొసైటీలోని ప్లాట్‌లలో మౌలిక వసతులు కల్పించేందుకు త్వరలోనే కమిటీలు వేసి పనులు చేపడుతామని చెప్పారు. సమావేశంలో వరంగల్ పట్టణ పట్టణ ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి మల్యాల వీరమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలను కూల్చిన వ్యక్తిని అరెస్టు చేయాలి : సీపీఎం



బాధితులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కరీమాబాద్, జూలై 18: బట్టుపల్లి రోడ్డులోని మల్లు స్వరాజ్యంనగర్-2లో బుధవారం రాత్రి పేదల గుడిసెలను కూల్చివేసిన వ్యక్తిని అరెస్టు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ముక్కెర రామస్వామి, సింగారపు బాబులు డిమాండ్ చేశారు. కూల్చివేసిన గుడిసెలను గురువారం సందర్శించారు. వారు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం 30 గుంటల ప్రభుత్వ భూమిలో నిరుపేదలు పార్టీ ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకుంటే, అర్ధరాత్రి అబ్బాస్ అనే వ్యక్తి రౌడీలతో, ప్రొక్లేన్‌లతో వచ్చి నిద్రలో ఉన్న పేదలను భయభ్రాంతులకు గురిచేసి, రాడ్లు, కత్తులు చూపిస్తూ చంపుతామని బెదిరించారని ఆరోపించారు. అబ్బాస్‌ను వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. దొంగ పత్రాలు సృష్టించి 495 సర్వే నెంబరు వేసి ప్రభుత్వ భూమిని అక్రమంగా దొంగ పట్టా చేయించుకొని ప్రజలను ఇబ్బంది పెడుతున్న పరిస్థితి ఉందన్నారు.

పేద ముదిరాజ్‌లను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ముదిరాజ్‌లు

సంగెం, జూలై 18: పేద ముదిరాజ్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా నాయకుడు నీరటి సదానందం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మనబోయిన అయిలయ్య, చొప్పరి సోమయ్య, పోలు అమర్‌చంద్, పోలేబోయిన శ్రీనివాస్, బోనాల భగత్, చాగంటి యాకయ్య, కేశబోయిన యాదగిరి, సింగారపు వేణు, ఉడుతల రామస్వామి, పిట్టల సాంబయ్య, దేవ సదానందం, హంస సంపత్, చిరబోయిన కట్టయ్య మొగిలి పాల్గొన్నారు.

ఎన్నికలు అనివార్యమైతే వరంగల్‌కు అవకాశమివ్వాలి

ఏకగ్రీవంగా తీర్మానించిన జిల్లా ఆర్యవైశ్య సంఘం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

కరీమాబాద్, జూలై 18: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ నియామకానికి ఎన్నికలు అనివార్యమైతే వరంగల్ జిల్లాకు అవకాశమివ్వాలని జిల్లా ఆర్యవైశ్య ప్రతినిధులు కోరారు. మహాసభలో సీనియర్ కార్యదర్శిగా సేవలందిస్తున్న వంగేటి అశోక్ కుమార్‌ను అధ్యక్షుడిగా నియమించాలని కోరుతూ ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల ఆర్యవైశ్య మహాసభల అధ్యక్ష, కార్యదర్శులు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గురువారం వరంగల్ బట్టలబజార్‌లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రతినిధుల సమావేశంలో తీర్మానించి, ఆ పత్రాన్ని రాష్ట్ర మహాసభకు పంపించారు. రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ నాయకత్వంపై విశ్వాసం ఉందని, ఒకవేళ ఎన్నికలు జరపాలని నిర్ణయిస్తే అశోక్‌కుమార్‌కు అవకాశం ఇవ్వాలని తీర్మానించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి వంగేటి అశోక్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొద్దుటూరి గౌరిశంకర్, సంయుక్త కార్యదర్శి ప్రతాపని పాండు రంగయ్య, కార్యవర్గ సభ్యులు చీదర బీరన్న, మాజీ మేయర్ గుండా ప్రకాష్‌రావు, వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ, అధ్యక్ష కార్యదర్శులు గందె శ్రీనివాస్, మునిగోటి రమేష్, నాళ్ల లక్ష్మీనర్సింహరావు, శిరుప అనిల్, సిద్ధంశెట్టి శ్రీనివాసరావు, దాచెపల్లి సీతారాం, గార్లపాటి శ్రీనివాస్, తోట హరీష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

బల్దియాలో బదిలీల ప్రక్రియ షురూ..

వరంగల్ కార్పొరేషన్, జూలై 18: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన కార్యాలయంతోపాటు కాశిబుగ్గ, కాజీపేట సర్కిల్ కార్యాలయాల్లో విధులు నిర్వర్తించే 4వ తరగతి ఉద్యోగులకు గురువారం బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్‌ఓ గణేశ్, ఇన్‌చార్జి అదనపు కమిషనర్ కృష్ణారెడ్డి, డీఎంహెచ్‌వో సాంబశివరావు, సూపరింటెండెంట్లు రావుల ఆనంద్, బాకం సంతోష్, డిప్యూటీ తహసీల్దార్లు సంతోష్‌కుమార్, శ్యామ్, డాక్టర్ పుట్ట మహేందర్‌రావు, ప్రతాప్‌రెడ్డిశ్యామ్‌లు కౌన్సెలింగ్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బదిలీలు పూర్తిగా పారదర్శకంగా జరుగుతాయన్నారు. 40శాతానికి మించకుండా సర్వీస్ బుక్ ఆధారంగా సీనియారిటీని దృష్టిలో పెట్టుకుని బదిలీలు చేయనున్నట్లు తెలిపారు. వైద్యపరమైన సమస్యలున్నవారు, గుండెజబ్బులు, బైపాస్ సర్జరీ, క్యాన్సర్, మానసిక వికలాంగులైన పిల్లలు జన్మించినవారు, కిడ్నీ మార్పిడీచేసుకున్న వారు, వితంతువులకు ఈ బదిలీలలో మినహాయింపు ఉంటుందని వెల్లడించారు.

445 మంది హాజరు



మహిళా ఉద్యోగికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్

కౌన్సెలింగ్‌లో 445 మంది ఉద్యోగులు హాజరయ్యారు. బల్దియా నుంచి పరకాలకు, పర కాల నుంచి హనుమకొండకు 40శాతం ఉద్యోగులలో 112మందికి బదిలీ తప్పదని సీనియర్ అధికారులు చెబు తున్నారు. 30 కేటగిరీలలో అటెండర్ల నుంచి జూనియర్ అసిస్టెంట్ల వరకు కౌన్సె లింగ్‌కు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వీరికి హనుమకొండ జిల్లా పరిధిలోని పరకాల, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్యాలయం, కాజీపేట, కాశిబుగ్గ కార్యాలయాల పరిధిలోని 66 డివి జన్‌లలో విధులు నిర్వర్తిస్తారు. మరో రెండు రోజుల్లో బదిలీల జాబితా అధి కారికంగా విడుదల చేయనున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ముంజ అనిల్ (ఫైల్)

శంభునిపేట, జూలై18: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనటంతో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి మామునూరు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. మామునూరు సీఐ రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం సూరారం గ్రామానికి చెందిన ముంజ అనిల్(24) మిషన్ భగీరథ ప్రాజెక్టులో పని చేస్తున్నాడు. బుధవారం హనుమకొండకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి తన ద్విచక్రవాహనంపై అనిల్ నగరానికి వచ్చాడు. తిరిగి అర్ధరాత్రి ఇంటికి వస్తుండగా పున్నేల్ క్రాస్ రోడ్డు సమీపంలో ఖమ్మం నుంచి వరంగల్ వైపు వస్తున్న లారీ ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావటంతో అనిల్ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలాడు. విషయం తెలుసుకున్న మామునూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. లారీని గుర్తించి లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి తండ్రి ముంజ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవికుమార్ తెలిపారు.



ఉపాధ్యాయులకు సభ్యత్వాలను అందచేస్తున్న శ్రీపాల్‌రెడ్డి

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

గీసుగొండ, జూలై 18: ఉపాధ్యాయుల సమస్యలు పంచాయత్‌రాజ్ టీచర్స్ యూనియన్(పీఆర్‌టీయూ)తోనే పరిష్కారమవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. గురువారం శాయంపేటహవేలి జెడ్పీ పాఠశాలలో నిర్వహించిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. లెఫ్ట్‌ఓవర్ వేకెన్సీల భర్తీ, బీఈడీ అర్హత గల ఎస్‌జీటీలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్‌లను ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్‌గఫర్, హెచ్ఎం సంపత్‌రావు, మండల అడహక్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మార్త శ్రీనివాస్, కె.వెంకటేశ్వర్లు, నాయకులు సూరం శంకర్‌రావు, తమ్మి దయాకర్, వెంకన్న, సరిత పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగ్‌ల పంపిణీ

మట్టెవాడ, జూలై 18: మట్టెవాడ పోలీసుల ఆధ్వర్యంలో కొత్తవాడలోని గిర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బ్యాగ్‌లను సీఐ తుమ్మ గోపి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మట్టెవాడ ఏఎస్సై చంద్రమౌళి, కానిస్టేబుళ్లు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీరన్నస్వామి హుండీ ఆదాయం లెక్కింపు

కరీమాబాద్, జూలై 18: కరీమాబాద్‌లోని బీరన్న దేవాలయంలోని హుండీని గురువారం ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లెక్కించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కోరె సదానందం ఆధ్వర్యంలో లెక్కించగా రూ.61,753 నగదు, వెండి, బంగారం, కరెన్సీలు వచ్చినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కురమ కులపెద్దలు దయ్యాల పురుషోత్తం, మండల రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే దాతలుగా సహకరించి ఈ సంవత్సరం బీరన్నస్వామి గుడికి రేకుల షెడ్ వేయించిన దాత కోరె చంద్రమౌళికి, నాగమయ్య గుడికి స్లాబ్ వేయించిన బండారి రాజేశ్వర్, ఎల్లమ్మ గుడిలో గ్రానైట్స్ వేయించిన దయ్యాల కిరణ్ బ్రదర్స్‌కి కరీమాబాద్ కుల పెద్దలు, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సన్మానించారు.

రుణమాఫీ జరగలేదని ఓ రైతు ఆవేదన

శంభునిపేట, జూలై 18: బొల్లికుంటకు చెందిన రైతు సోల్తి రవీందర్ ఖిలావరంగల్ మండలం బొల్లికుంటలో పీఏసీఎస్ చైర్మన్ కేడల జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన రుణమాఫీ కార్యక్రమంలో ఆవేదన వినిపించారు. సీఎం రేవంత్‌తో రైతుల వీడియోకాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం రవీందర్ అక్కడున్న అధికారులు, రైతుల ఎదుట తనకు అన్యాయం జరిగిందంటూ వాపోయారు. రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వంలోనూ మోసపోయానని, ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా తనకు న్యాయం చేయలేదని వాపోయాడు. తనకున్న ఎకరం భూమిలో 24గుంటలు కూతురు పెళ్లికి అమ్ముకున్నానని, 2017లో సొసైటీలో రూ.30వేల రుణం తీసుకున్నానని, అయినా తనకు రుణమాఫీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లె మల్లేష్‌పై సస్పెన్షన్ వేటు

రాయపర్తి, జూలై 18: ఇటీవల మండలంలోని బురహాన్‌పెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్‌ను, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పల్లె మల్లేష్ హత్య చేయడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి అతన్ని సస్పెండ్ చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డిలు ప్రకటించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీయని, ప్రతి కార్యకర్త క్రమశిక్షణగా పనిచేయాలని, ఎలాంటి చట్ట విరుద్ధ కార్యక్రమాలు చేసినా, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు గబ్బెట బాబు, ఉప్పలయ్య, కృష్ణరావు, సుదర్శన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, కృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారులను ఆదుకోవాలి

ఉమ్మడి జిల్లా ఉద్యమ కళాకారుల సంఘం అధ్యక్షుడు సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం సుధాకర్

కరీమాబాద్, జూలై 18: రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కళాకారులను ఆదుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఉద్యమ కళాకారుల సంఘం అధ్యక్షుడు గడ్డం సుధాకర్ ప్రభుత్వాన్ని కళాకారుల తరఫున కోరారు. గురువారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల ఉమ్మడి జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పా టు కోసం కళాకారులు ఉద్యమానికి బలాన్నిచ్చారన్నారు. గత ప్రభుత్వం కళాకారుల కష్టాన్ని గుర్తించి 550 మందికి సాంస్కృతిక సారథిని స్థాపించి ఉద్యోగాలు కల్పించినట్టు గుర్తుచేశారు. కానీ స్వరాష్ట్రం కోసం తపించిన కళాకారులు వేలాది సంఖ్యలో ఉన్నారని, తమకూ అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరుతూ, కోర్టులను ఆశ్రయిస్తూ కళాకారుల తమ పోరాటాలను కొనసాగిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కళాకారులకు అండగా ఉంటామని, ఉద్యో గ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అనడంతో కళాకారుల్లో ఆశలు చిగురించాయన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వానికి నిజమైన కళాకారులను ఎంపి క చేసి నివేదిక ఇవ్వాలని జిల్లాల వారీగా కమిటీలు వేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అనువోజు వెంకన్న, కల రాజేశ్వర్‌రావు, సిల్వేరు శ్రీనివాస్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు పాలాటి రమేస్, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు అంకుస్ రాజ్, జనగామ జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల నరసింహా, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు మంతాల సంబరాలు, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలేటి నాగరాజు దమ్మన్నపేట, ఉపాధ్యక్షుడు తండా సదానందం, గజ్జల లింగమూర్తి, లింగన్న, సురేందర్, రమేష్, ప్రతాప్, రమేష్, 250 మంది కళాకారులు పాల్గొన్నారు.



నలుగురు దొంగల అరెస్ట్

గీసుగొండ, జూలై 18 : జిల్లాలో పలు చోట్ల దొంగతనాలకు పాల్పడిన నలుగురు దొంగలను అరెస్ట్ చేసినట్లు సీఐ బాబులాల్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద ఎస్ఐ జానీపాష ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా స్కూటీలపై వెళ్తుండగా పోలీసులు విచారించారు. విచారణలో కాశిబుగ్గకు చెందిన పల్లకొండ ఉపేందర్, పల్లకొండ వంశీ, పులిచేరు ప్రసాద్, జూలూరి ధనుష్‌లు పలు దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించి వారిని అరెస్ట్ చేశారు. వీరు గొర్రెకుంటలోని టీఎస్ఎన్‌పీడీసీఎల్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేర్ షెడ్‌లో కాపర్ వైర్లను, గోపాల్‌రెడ్డినగర్‌లో, హరిహర ఎస్టేట్‌లో అపర్ణ అపార్ట్‌మెంట్‌లో ఇంటి తాళాలను పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లినట్లు విచారణలో తేలినట్లు సీఐ చెప్పారు. దీంతో రెండు స్కూటీలను సీజ్‌చేసి వారిని కోర్టులో హాజరుపరిచనట్లు సీఐ చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐ జానీపాష, ఏఎస్ఐ సుదర్శన్ పాల్గొన్నారు.

పాకాల ఆయకట్టులో ఆరంభమైన వరి నాట్లు



ఖానాపురంలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

ఖానాపురం, జూలై 18 : ఇటీవల కురుస్తున్న వర్షాలతో పాకాల సరస్సులోకి 20 అడుగుల నీరురావడంతో మండల వ్యాప్తంగా పాకాల ఆయకట్టులో రైతులు సాగులో నిమగ్నమయ్యారు. గురువారం నుంచి వరినాట్లు ఊపందుకున్నాయి. పాకాల ఆయకట్టులో ఏటా వానాకాలంలో సుమారు 30వేల ఎకరాల్లో వరిసాగవుతుంది. పాకాల సరస్సు పూర్తినీటి సామర్థ్యం 30 అడుగులు కాగా, ప్రస్తుతం 20 అడుగుల నీరు సరస్సులోకి చేరుకుంది. సరస్సులోకి మరో నాలుగు అడుగుల నీరు వస్తే వానాకాలంలో పూర్తిస్థాయిలో పంటలుపండుతాయి. రామప్ప-పాకాల ప్రాజెక్ట్ అందుబాటులోకి వచ్చినందున గోదావరి జలాలు పాకాల సరస్సులోకి వచ్చే అవకాశం ఉన్నందున ఈ వర్షాకాలంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోయినా రామప్ప- పాకాల ప్రాజెక్ట్ భరోసాతో రైతులు పాకాల ఆయకట్టులో పూర్తిస్థాయిలో నార్లుపోసి సాగుకు సమాయత్తం అవుతున్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ ధ్యేయం



ఉపాధ్యాయులకు సభ్యత్వం అందజేస్తున్న పింగిళి శ్రీపాల్‌రెడ్డి

నల్లబెల్లి, జూలై 18 : ప్రభుత్వ ఉపాధ్యాయులకు త్వరలో నగదు రహిత హెల్త్ కార్డులు ఇప్పిస్తామని, ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ ధ్యేయమని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం శ్రీపాల్‌రెడ్డి హాజరై సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.పీఆర్‌టీయూ ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు రవీందర్‌రెడ్డి, అబ్దుల్ గఫార్, మహేందర్‌రెడ్డి, ఉడుత రాజేందర్, చంద్రశేఖర్, తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

• గీసుగొండ: ఉపాధ్యాయుల సమస్యలు పంచాయత్‌రాజ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ)తోనే పరిష్కారమవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శాయంపేటహవేలి జెడ్పీ పాఠశాలలో నిర్వహిం చిన సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. లెఫ్ట్‌ఓవర్ వేకెన్సీల భర్తీ, బీఈడీ అర్హత గల ఎస్‌జీటీలకు ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్‌లను ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గఫార్, హెచ్‌ఎం సంపత్‌రావు, మండల అడహక్ కమిటీ అధ్యక్షకార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాయకులు శంకర్‌రావు, దయాకర్, వెంకన్న, సరిత పాల్గొన్నారు.

• నర్సంపేట: పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని పట్టణంలోని బాలుర హైస్కూల్ హెచ్‌ఎం కొర్ర సారయ్య, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, సంఘం మండలశాఖ అధ్యక్షుడు పోరెడ్డి గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బాలుర హైస్కూల్ ఆవరణలో ఆ సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోడం సాంబయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పాత శ్యాంప్రసాద్, మండల కార్యదర్శి శీలం మల్లయ్య ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

రుణమాఫీతో రైతుల్లో ఆనందం

చెన్నారావుపేట, జూలై 18 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రైతులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించి తీరుతామని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులతో చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలోనే రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తున్నదన్నారు. నియోజకవర్గంలో 12,462మంది రైతులకు రూ.67వేల కోట్లను మాఫీ చేశారన్నారు. చెన్నారావుపేట మండలంలో 1296 మంది రైతులు గతంలో తీసుకున్న రుణాలను ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తారన్నారు. రుణమాఫీ రాని రైతులు ఏవన్న లోపాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణ మాఫీ చేస్తామన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులు బాగా లేకున్నా, ఆర్థిక భారమైనా రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఆగస్టు నెలఖారులోగా రూ.2 లక్షల వరకు రైతులందరికీ రుణమాఫీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, పీసీసీ మెంబర్ రామనంద్, రాజేందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికారి రవీందర్‌రావు. ఏడీఏ నగేష్, మండల ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఎంపీడీవో దయాకర్, బ్యాంక్ మేనేజర్ మోహన్‌ఖాన్, ఏవో శశికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, కిసాన్ సెల్ జిల్లా నాయకులు మధుసూదన్‌రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు హరీష్, కుమారస్వామి, నారాయణరెడ్డి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : రైతును రాజుచేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు అన్నారు. పట్టణంలోని రైతు వేదిక వద్ద రైతులకు ప్రభుత్వం రుణాలు మాఫీ చేయడంతో సంబరాలు చేసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దేశ చరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని, రుణమాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు స్పష్టమైన ఆదేశాలివ్వడంతోపాటు పథకం అమలు కోసం ప్రతిబ్యాంక్‌లో ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించిందన్నారు. వర్ధన్నపేట రైతు వేదికలో రుణ మాఫీపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సత్యాశారద, ఎమ్మెల్యే నాగరాజు ఆపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రముఖ న్యాయవాది శేఖర్‌రావు, రాజిరెడ్డి, సురేష్‌కుమార్, రాజు, ప్రభాకర్‌గౌడ్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

• పర్వతగిరి : మండలకేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు క్షీరాభిషేకం నిర్వహించారు. బాణాసంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అనీల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, నాయకులు సునీల్‌రావు, రాంచందర్, గంగాధర్‌రావు, అనిల్, భిక్షపతి, మహేంద్ర, సువర్ణ, రమేష్, శ్రీనివాస్, పూర్ణచందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

• దుగ్గొండి : రుణమాఫీ చేయడంపై మండల కేంద్రంలో, బందంపల్లి, కేశావాపురం తదితర గ్రామాల్లో సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి టెలికాన్ఫరేన్స్‌కు అధికారులు, ప్రజాప్రతి నిధులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి దయాకర్, ఎంపీడీవో అరుంధతి, డీటి ఉమారాణి, ఎంపీవో శ్రీధర్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు మహిపాల్‌రెడ్డి, షైడి, మార్కెట్ డైరెక్టర్లు రామారావు, దంజానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మండల పార్టీ అధ్యక్షుడు బాబు, మండల వర్కింగ్ ప్రెసిడంట్లు కిరణ్‌రెడ్డి, నర్సింగరావు, రాజు, రఘుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

• నల్లబెల్లి:మండల కేంద్రంతోపాటు పలుగ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు కాల్చారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : మండలంలోని కట్ర్యాలలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్రంలోని రైతులకు రూ. లక్ష వరకు రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుల చిత్రపటాలకు మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిమిరెడ్డి కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్యలు పాలాభిషేకం చేసి, స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్, రవీందర్‌రెడ్డి, అక్బర్, సదయ్య, రవీందర్, వెంకన్న, కుమారస్వామి, ముత్యాల యాకయ్య, సాయిలు పాల్గొన్నారు.

• నెక్కొండ : నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణ సంచాలను పెల్చి, మిఠాయిలను పంచిపెట్టి సంబరాలను జరుపుకున్నారు. నెక్కొండ మండలంలో ఒక లక్షలోపు 2649 మంది రైతులకు రుణమాఫీ జరిగింది. నెక్కొండలోని రైతువేదికలో రైతుల రుణమాఫీపై జరిగిన ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏవో నాగరాజు, మార్కెట్ డైరెక్టర్‌లు విజయ్, కొమురయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్, పట్టణ అధ్యక్షుడు హరిప్రసాద్, సూరుపల్లి సొసైటీ చైర్మన్ దామోదర్‌రెడ్డి, నాయకులు తిరుమల్, చెన్నకేశవులు, లక్ష్మన్, సుబ్బారెడ్డి, షబ్బీర్, రఘు, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, సాయికృష్ణ, దీలిప్, ఏకాంబ్రం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

• గీసుగొండ : కాంగ్రెస్ నాయకులు, రైతులు భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. రైతు వేదికల్లో భారీ స్క్రీన్‌ల ద్వారా సీఎం చేసిన ప్రసంగాన్ని రైతులు, అధికారులు వీక్షించారు. అనంతరం అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి మాట్లాడుతూ 11లక్షల రైతు కుటుంబాకు లబ్ధిచేకూరేలా మొదటి దఫాగా రూ.6098కోట్లను రైతుల ఖాతాల్లో వేయడంతో సంతోషంగా ఉన్నారన్నారు.కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సౌజన్య, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

• ఖానాపురం: మండలంలోని అశోక్‌నగర్‌లో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావు ఆధ్వర్యంలో, మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేత్తం కార్యక్రమంలో భాగంగా నర్సంపేట ఏఎంసీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కార్ఫరెన్స్ వీక్షించిన అనంతరం రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే దొంతి మాదవరెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టి, టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవో సంతోష్, సంధ్య, నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ సారంగపాణి, ప్రభాకర్‌రావు, సంపత్‌రావు, అచ్యూతమ్, సాగర్‌రావు, రాజు, ముస్తఫా, ఎల్లగౌడ్, మధు, లింగయ్య పాల్గొన్నారు.

• రాయపర్తి : రైతు వేదికలో రైతుల రుణమాఫీపై జరిగిన ముఖ్యమంత్రి రెవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను రాయపర్తి ఏవో వీరభద్రం రెడ్డి వీక్షించారు. రైతులు సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, రైతులు మహేందర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రాంబాబు, యాదవరెడ్డి, గబ్బెట బాబు, కృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రావు, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో టెలీకాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, అపెక్స్ చైర్మన్



నెక్కొండలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మార్కెట్ చైర్మన్, రైతులు



అశోక్‌నగర్‌లో ఏఎంసీ వైస్ చైర్మన్‌కు మిఠాయి తినిపిస్తున్న రైతులు



దుగ్గొండిలో క్షీరాభిషేకం చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

పల్లె మల్లేష్‌పై సస్పెన్షన్ వేటు



రాయపర్తిలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాయపర్తి, జూలై 18 : ఇటీవల మండలంలోని బురహాన్ పెల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్‌ను, అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పల్లె మల్లేష్ హత్య చేయడంతో కాంగ్రెస్ పార్టీ నుంచి అతన్ని సస్పెండ్ చేస్తున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డిలు ప్రకటించారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ జాతీయ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కలిగిన పార్టీయని, ప్రతి కార్యకర్త క్రమశిక్షణగా పనిచేయాలని, ఎలాంటి చట్టవిరుద్ధ కార్యక్రమాలు చేసినా, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.కార్యక్రమంలో పాలకుర్తి దేవస్థాన చైర్మన్ కృష్ణమాచార్యులు, నాయకులు బాబు, ఉప్పలయ్య, కృష్ణరావు, సుదర్శన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి ఒకరి బహిష్కరణ

ఖానాపురం, జూలై 18 : కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న ఒకరిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు ధర్మరావుపేట గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొనకటి రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన గాలి దేవేందర్ పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా, వ్యక్తిగత దూషనలకు పాల్పడినందున గ్రామ పార్టీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించి దేవేందర్‌ను పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. ఇక మీదట దేవేందర్‌కు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి సంబంధంలేదని తెలిపారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

దుగ్గొండి, జూలై 18 : మండలంలోని వెంకటాపురం శివారు మంగళితండాలో గురువారం తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. 9రకాల గింజలను ఒక గూడారంలో ఉంచి 9 రోజు ల పాటు ఉంచి మొలకెత్తే విధంగా తగు ఏర్పాట్లుచేస్తారు. మొల కెత్తిన మొక్కలను తండా యువతులు ఎత్తుకొని దేవాలయం దగ్గరకు పోయి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేయడం తీజ్ పండుగ ప్రత్యేకతగా చాటుకుంటుంది. కార్యక్రమంలో తండా పెద్ద దారవతు రాజయ్య తండా వాసులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి

నల్లబెల్లి, జూలై 18 : ముదిరాజ్‌లను వెంటనే బీసీడీ నుంచి బీసీఏలోకి మార్చాలని నల్లబెల్లి ముదిరాజ్‌ల మండల అధ్యక్షుడు దామ సాంబయ్య అన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్‌ల సమస్యలపై గురువారం తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్‌లు రాంబాబు, మొగిలి, పద్మ, కొమ్మాలు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

• నెక్కొండ : ముదిరాజ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి కోట్లను కేటాయించడంతో పాటు కేటగిరి బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని కోరుతూ ముదిరాజ్ సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జిల్లా బాధ్యుడు సుప్పరి సోమయ్య, నాయకులు మొగిలి, పద్మ, సాంబయ్య, వెంకన్న, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

• సంగెం: పేద ముదిరాజ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మండల కేంద్రంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతి పత్రం అందించారు. జిల్లా నాయకుడు నీరటి సదానందం మాట్లాడుతూ ఎన్నికలసమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీమేరకు ముదిరాజ్‌లను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అయిలయ్య, సోమయ్య, అమర్‌చంద్, శ్రీనివాస్, భగత్, యాకయ్య, యాదగిరి, రామస్వామి,సాంబయ్య, వేణు, సదానందం, సంపత్, కట్టయ్య, మొగిలి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



పర్వతగిరిలో విద్యార్థినికి సైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

పర్వతగిరి, జూలై 18: విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేసి, మాట్లాడారు. విద్యకోసం ప్రభుత్వం అనేక సౌకర్యాలుకల్పిస్తుందని, విద్యార్థులకు సకాలంలో పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాంలను అందించినట్లు తెలిపారు. ఆయా పాఠశాలల్లో కిచెన్ షెడ్ల నిర్మాణం కొరకు తన సీడీఎఫ్ నిధులను అందించనున్నట్లు తెలిపారు. రోటరీ క్లబ్ ద్వారా పాఠశాలల్లో లైబ్రరీల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేష్‌బాబు, ఉపాధ్యాయులు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీపడేది లేదు



దేవేందర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

రాయపర్తి, జూలై 18 : నియోజకవర్గ అభివృద్ధిలో రాజీపడేది లేదని, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడతామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి అన్నారు. మండలంలోని కొండూరు పెద్ద చెరువు పరిస్థితిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మరమ్మతుల నిమిత్తం నిధులను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో రాజీపడబోమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని అందులో భాగంగానే రైతులకు రుణమాఫీ చేసి మాట నిలబెట్టుకుందన్నారు. అనంతరం ఇటీవల మండలంలోని బురాహన్‌పెల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ సూదుల దేవేందర్ కుటుంబాన్ని పరామర్శించి, చిత్రపటానికి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి అన్ని రకాలుగా అండగా ఉంటామని తెలిపారు. దోషులపై కఠిన చర్యలు తీసుకునేలా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి నాయకులు రాజు, దేవేంద్ర, రాంబాబు, రత్నాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కాలేజ్‌కి సొంత భవనం నిర్మించాలి



ఆర్డీవో కార్యాలయ ఉద్యోగికి వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

నర్సంపేట, జూలై 18 : పట్టణంలోని దారకపేట రోడ్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని గురువారం ఆర్డీవో కార్యాలయ ఉద్యోగికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవనం నిర్మించి విద్యార్థులు భయం మధ్య చదువుకునే పరిస్థితులను దూరంచేయాలని కోరారు. శిథిలమైన కళాశాల భవనంకూలితే విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు ఉన్నందున అధికారులు కళాశాల భవనం సందర్శించి నూతన భవనం నిర్మించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్యామ్, కళ్యాణ్, రవి. రంజిత్, సుశీల్, పవన్, కళ్యాణి, రజిత తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీకి ఎంపికైన విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దుగ్గొండి. జూలై 18 : జిల్లా కేంద్రంలో ఈ నెల 17న రాష్ట్ర రూరల్ గేమ్స్ ఆధ్వర్యంలో చాంపియన్ షిప్ కబడ్డీ అండర్ 14 విభాగంలో నిర్వహించిన క్రీడల్లో మండలంలోని గిర్నిబావి పరిధిలోని న్యూ విజన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని, ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, కరస్పాండెంట్ పోరెడ్డి నర్సింహారెడ్డిలు గురువారం వెల్లడించారు. పాఠశాలలో 9వ తరగతి చదువుచున్న జగన్, రాజేందర్, 8వ తరగతి చదువుచున్న రాంచరణ్ జాతీయ స్థాయికి ఎంపికయ్యారని, వీరు ఈ నెల 27, 28 తేదిలలో హర్యానాలో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ క్రీడల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు రాజేందర్, శ్రీధర్, డైరెక్టర్ మోతె రాజులు అభినందించారు.

సోషల్ వెల్ఫేర్ డీసీవోను కలిసిన స్వేరోస్ నాయకులు



అపర్ణకు పుస్తకాన్ని అందిస్తున్న స్వేరోస్ నాయకులు


పర్వతగిరి, జూలై 18 : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో ప్రిన్సిపాల్, జిల్లా సోషల్ వెల్ఫేర్ కో-ఆర్డినేటర్‌గా విధులు చేపట్టిన అపర్ణను గురువారం స్వేరోస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పుస్తకాన్ని బహూకరించారు. రాష్ట్రస్థాయిలో పర్వతగిరి పాఠశాల, కళాశాలకు పేరుతీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యువ జాతీయ పురస్కార అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్, స్వేరోస్ జోనల్ కమిటీ మెంబర్ జంగిలి యాకయ్య, జిల్లా సెక్రటరీ గారె జయరాజ్, నాయకులు ఆనంద్, చందు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఖానాపురం, జూలై 18 : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని దుగ్గొండి సీఐ రాజగోపాల్ అన్నారు. గురువారం బుధరావుపేట ప్రభుత్వ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సదాకర్ అధ్యక్షతన విద్యార్థులకు సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వ్యసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సోషల్ మీడియా ఎంత వేగంగా విస్తరిస్తున్నదో అంతే వేగంతో సైబర్ నేరాల ఉచ్చులో యువత పడిపోతున్నారన్నారు. సైబర్ మోసాకు గురైతే బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కాకూడదని, వాటికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రఘుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట: సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ ఆయన సందర్భంగా రైతులు అనందంలో ఉన్నారని, ఇదే అదనుగా భావించి సైబరాలు కేటు గాళ్లు రైతుల ఖాతాలను హ్యాక్ చేసే ప్రమాదం ఉందన్నారు. ఓటీపీలు, మేసేజ్‌లు వచ్చినా ఎవరితో పంచుకోకుండా ఉండాలని కోరారు. ఎవరైనా సైబర్ నేరానపడితే ట్రోల్ ఫ్రీ నెంబర్ 1930లో ఫిర్యాదు చేయాలని కోరారు.

వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వైద్య సిబ్బందితో మాట్లాతున్న డాక్టర్ ప్రకాష్

చెన్నారావుపేట. జూలై 18 : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాష్ అన్నారు. మండలంలోని జోజిపేట నారాయణతండాలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. ఇంటి చుట్టుపక్కల మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. 50 మంది పరీక్షలు చేపట్టి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సరోజ, సూపర్‌వైజర్ రామెల్, సిబ్బంది వెంకట్‌రెడ్డి, లింగమూర్తి, సురేందర్ పాల్గొన్నారు.

• వర్ధన్నపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాయపర్తి పీహెచ్‌సీ వైద్య బృందం మౌనిక, సువర్ణలు అన్నారు. గురువారం వర్ధన్నపేట పట్టణంలోని ఫిరంగిగడ్డలో వైద్యశిబిరం నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వర్షకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులపై అశ్రద్ధ వహించకుండా ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని కోరారు. వీలైనంత వరకు కాచీచల్లర్చిన నీటిని తాగాలని, వేడి ఆహారపద్ధాలను భుజించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు మంజుల, ఆశ వర్కర్లు కళ్యాణి, రమ, మంగమ్మ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.